సాక్షి నిజామాబాద్

బుధవారం । 18 । జూన్ । 2025



రైతన్న.. జర భద్రం

ఖరీఫ్ సీజన్ పంటల సాగు ఊపందుకుంది. రైతులకు పొంచి ఉన్న ప్రమాదాలను అధిగమించడం కత్తిమీద సాములాంటిది.

- 8లో ▸



ఏటా ఇదే కోత!

ఎస్సారెస్పీ మిగులు జలాలను సద్వినియోగ పరిచేందుకు నిర్మించిన వరద కాలువ ప్రతి సంవత్సరం కోతకు గురవుతోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /24.2

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం : కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం (పెట్టుబడి సాయం) నిధులు వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించి జిల్లాలో 2,98,472 మంది రైతుల ఖాతాల్లో రూ. 326.03 కోట్లు జమ చేస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 2,12,172 మంది రైతుల ఖాతాలలో రూ. 160.72 కోట్లు జమ అయ్యాయన్నారు. ఈ నెల 16న రెండెకరాల లోపు భూమి కలిగిన 1,68,166 మంది రైతుల ఖాతాలలో ఎకరాకు రూ. ఆరు వేల చొప్పున రూ. 95.66 కోట్లు జమ అయ్యాయన్నారు. మంగళవారం మూడెకరాల వరకు భూమి ఉన్న 44,006 మంది రైతుల ఖాతాలలో రూ. 65.06 కోట్లు జమ అయినట్లు కలెక్టర్ వివరించారు. మిగతా రైతులకు కూడా పెట్టుబడి సాయం వారి ఖాతాలలో జమచేయనున్నట్లు తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా పథకం ఉపయుక్తంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2025–26 విద్యాసంవత్సరానికి దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు బుధవారం ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని అడ్మిషన్స్ డైరక్టర్, దోస్త్ కోఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరి పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ అక్టివిటీస్ సంబంధించి విద్యార్థులు తెయూ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు, కాలువల నుంచి వెళ్లే నీరు సమానంగా ఉండటంతో నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్‌లోకి 599 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 268 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1063.20(13.83 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

గోదావరిలో 'ప్రకృతి అందాలు'







శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతం ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎటు చూసినా పచ్చిక బయళ్లు, జల సవ్వడులు, పొడవైన తాటి చెట్లు, ఆకాశంలో నీలి మేఘాలు, ఎగురుతూ వచ్చే పక్షులు, మునిగి తేలిన పాత ఆలయాలు.. కళ్లను కట్టిపడేసే ఈ సుందరమైన దృశ్యాలను దొంకేశ్వర్ మండలం గాదేపల్లి, జీజీ నడ్కుడ శివారు ప్రాంతాల్లో 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – దొంకేశ్వర్(ఆర్మూర్)

వరి నాట్లు ముమ్మరం

వర్షాలు ఈసారి ముందుగానే పలకరించడంతో రైతులు సాగు ప్రక్రియ చేపట్టారు. వర్ని, రుద్రూర్ ప్రాంతాల్లో నాట్లు వేసే పని వేగంగా సాగుతోంది. ఇప్పటివరకు 31,911 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారు. సోయా, మొక్కజొన్న, పసుపు విత్తడం పూర్తయింది. కందులు, మినుములు, పత్తి సాగు ప్రక్రియ ఇప్పుడిప్పుడే నిదానంగా మొదలవుతోంది. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుతో ఈసారి పసుపు సాగు విస్తీర్ణం పెరగనుంది.

- ముందస్తు వర్షాలతో సాగు పనులు ప్రారంభం
- ఇప్పటి వరకు 31,911 ఎకరాల్లో నాట్లు వేసిన రైతులు
- వేగం పుంజుకున్న మక్క, సోయా విత్తుడు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు అదును చూసి పనులు చేపడుతున్నారు. ప్రతి ఏటా వరి సాగులో రాష్ట్రంలోనే ముందంజలో ఉండే బోధన్, బాన్సువాడ డివిజన్లలో రైతులు ఈసారి కూడా యథావిధిగా అందరికంటే ముందుగానే నాట్లు వేయడం ప్రారంభించారు. ముఖ్యంగా వర్ని, రుద్రూర్ ప్రాంతాల్లో నాట్లు వేసే పని వేగంగా నడుస్తోంది. ఈ సీజన్‌లో జిల్లాలో 4,32,635 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే సీజన్ మొదలయ్యాక ఇప్పటివరకు 31,911 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారు. వర్షాలు సైతం ఈసారి ముందుగానే పలకరించడంతో రైతులు సాగు ప్రక్రియ చేపట్టారు. మరోవైపు సోయా సాగు ఈ సీజన్‌లో 37,959 ఎకరాల్లో ఉంటుందని అధికారులు అంచనాలు వేయగా ఇప్పటివరకు 7,462 ఎకరాల్లో విత్తారు. ఇక మొక్కజొన్న విషయానికి వస్తే 47,678 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేయగా ఇప్పటివరకు 10,065 ఎకరాల్లో విత్తారు. పసుపు పంట ఇప్పటివరకు 11,484 ఎకరాల్లో విత్తడం పూర్తయింది. ఇక కందులు, మినుములు, పత్తి సాగు ప్రక్రియ ఇప్పుడిప్పుడే నిదానంగా మొదలవుతోంది. ఇదిలా ఉండగా గడిచిన సీజన్‌లో ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.

పసుపు సాగు అంచనాలకు మించే అవకాశం

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ ఏడాది పసుపు సాగు పెరగనున్నట్లు తెలుస్తోంది. పసుపు పంటకు సంబంధించి ఈసారి గిట్టుబాటు ధర సైతం బాగానే దక్కడంతో రైతుల్లో ఆశలు నెలకొన్నాయి. పసుపు బోర్డు ఏర్పాటులో భాగంగా కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఈ నెల ఆఖరులో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో పసుపు బోర్డు ఏర్పాటు, రైతులకు ఇవ్వనున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, ఎగుమతులకు దన్నుగా నిలిచే అంశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు పసుపు సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. సహకార శాఖకు సైతం మంత్రిగా ఉన్న అమిత్‌షా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలో పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాల సంఖ్య పెరుగుతోంది. పసుపు సాగుకు రైతులు మరింతగా మొగ్గు చూపుతున్నారు.

ఇందూరుకు కోఆపరేటివ్ యూనియన్ శిక్షణ కేంద్రం

- ఫలించిన మానాల మోహన్‌రెడ్డి కృషి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కృషితో ఇందూరుకు కోఆపరేటివ్ యూనియన్ శిక్షణ కేంద్రం మంజూరైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ సంస్థకు కేవలం హైదరాబాద్, వరంగల్‌లలో మాత్రమే శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. మోహన్‌రెడ్డి కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ అయ్యాక శిక్షణ కేంద్రాలను పెంచాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

దీంతో నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. రానున్న కాలంలో అన్ని ఉమ్మడి జిల్లాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ శిక్షణ కేంద్రం ద్వారా కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. వీటిని త్వరలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ప్రారంభించనున్నట్లు మానాల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘు నందన్‌రావుకు మానాల ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ నేరాలు, గేమింగ్ యాప్‌లపై దృష్టి సారించాలి

రెంజల్(బోధన్): సైబర్ నేరాలు, గేమింగ్ యాప్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సాయి చైతన్య సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా గ్రామాల్లో కౌన్సెలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. మంగళవారం రెంజల్‌లోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ విధంగా ఫిర్యాదులు తీసుకుంటున్నారు, కేసుల నమోదు ఎలా చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బందితో పాటు ఫిర్యాదు దారుల వాహన పార్కింగ్‌ను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకునాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నాయని, నిత్య వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు హెల్మెట్ వినియోగం పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గంజాయి నిర్మూలనకు తీసుకునాల్సిన జాగ్రత్తలను పోలీసులకు వివరించారు. యువత గంజాయి బారిన పడకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరగాళ్లతో పాటు గేమింగ్ యాప్‌ల వలలో చిక్కకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై చంద్రమోహన్‌లు ఉన్నారు.



రెంజల్ ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

సఖీ సెంటర్ తనిఖీ..

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో గల సఖీ సెంటర్‌ను సీపీ సాయి చైతన్య మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆశ్రయం పొందుతున్న గృహహింస, చీటింగ్ కేసు బాధిత మహిళలతో కమిషనర్ మాట్లాడారు. సఖీ సెంటర్‌కు వచ్చే కాల్స్, ఫాలోఅప్ చేసే విధానం, మెయింటెనెన్స్ బాగుందని ప్రశంసించారు. బాధిత మహిళలకు అన్ని రకాల సేవలు సకాలంలో అందించాలన్నారు. సఖీ సెంటర్, భరోసా, ఐసీపీఎస్ ఒకే దగ్గర ఉంటే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్ బీ, ఉమెన్ కమిషన్ సభ్యులు సుదం లక్ష్మి, స్నేహ సొసైటీ అండ్ సఖీ సెక్రెటరీ సిద్దయ్య, సఖీ సెంటర్ అధికారి భానుప్రియ, డీసీపీవో చైతన్య, సఖీ సిబ్బంది పాల్గొన్నారు.



సఖీ సెంటర్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య

ప్రశాంతంగా టీజీ సెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్: టీజీ సెట్ కౌన్సెలింగ్ మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశాలకు నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో మొదటి రోజు 295 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలన చేశారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు సమన్వయకర్త భారతి తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన ముగిసిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. ఈనెల 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, ఈనెల 20, 21న వెబ్ ఆప్షన్లు ఉంటాయన్నారు.



అభ్యర్థికి పరిశీలన పత్రం అందిస్తున్న సమన్వయకర్త భారతి

కస్తూర్బాల్లో అడ్మిషన్లకు క్రేజీ

- వేసవిలోనే సీట్లు భర్తీ
- బాలికలకు అందుతున్న మెరుగైన విద్య
- సీట్ల సంఖ్య పెంచాలని డిమాండ్



ఏర్గట్లలోని కస్తూర్బా పాఠశాల భవనం

మోర్తాడ్(బాల్కొండ): కస్తూర్బా గురుకులాల్లో చదువుకోడానికి విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. వేసవిలోనే అడ్మిషన్ల కోసం ఎంతో మంది పేర్లు నమోదు చేయించుకోవడంతో బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు నిండిపోవడం విశేషం. ఇంటర్ అప్‌గ్రేడ్ చేసిన చోట ప్రథమ, ద్వితీయ సంవత్సర తరగతుల్లోను సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి. గతంలో కేవలం బడి మానివేసిన బాలికల కోసమే కస్తూర్బా పాఠశాలల్లో అడ్మిషన్లు ఇచ్చేవారు. డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించడం కోసం బాలికలు ఏ తరగతిలో బడి మానివేస్తే ఆ తరగతిలో అడ్మిషన్ ఇచ్చి చదువు చెప్పేవారు. కస్తూర్బా పాఠశాలల ఏర్పాటు లక్ష్యం ఎలా ఉన్నా రానురాను రెగ్యులర్ విద్యార్థినుల కోసమే తరగతుల నిర్వహణ సాగుతోంది. మోర్తాడ్, భీమ్‌గల్, బాల్కొండ, మెండోరా కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్ విద్యను అమలు చేస్తున్నారు. మెండోరాలో ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ తరగతులు మొదలుకానున్నాయి. ఇక్కడ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు జారీ చేస్తున్నారు. కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, ముప్కాల్, వేల్పూర్ పాఠశాలలను ఇంకా అప్‌గ్రేడ్ చేయలేదు. గదుల కొరత ఇతర కారణాల వల్ల నాలుగు చోట్లనే ఇంటర్ విద్యను బోధిస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువు చెబుతున్నారు. ఈ తరగతులకు సంబంధించి ప్రతి పాఠశాలలో 200 చొప్పున సీట్లు భర్తీ అయ్యాయి. ఏర్గట్ల పాఠశాలలో పాఠశాల విద్యార్థుల సంఖ్య 270 కి చేరింది. అడ్మిషన్లు ఎక్కువ కావడంతో వారికి మెస్ చార్జీల కోసం ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న చోట ప్రథమ, ద్వితీయ తరగతులకు సంబంధించి 160 సీట్లు భర్తీ అయ్యాయి. బాలికల కోసం ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలలను నిర్వహిస్తున్నా కస్తూర్బా పాఠశాలల్లో సైతం సీట్లు పూర్తిగా నిండటం గమనార్హం. ఇంటర్‌కు సంబంధించి ఎంపీసీ, బైపీసీ, నర్సింగ్, సీఈసీ గ్రూపులలో తరగతులను నిర్వహిస్తున్నారు.

ఇంగ్లీష్ మాధ్యమానికి డిమాండ్ ఏర్పడటంతో అన్ని చోట్ల ఆంగ్ల మాధ్యమంలో తరగతుల నిర్వహణ సాగుతోంది. ఏది ఏమైనా కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు నిండిపోవడం, ఇంకా అడ్మిషన్ల కోసం అనేక మంది ఆసక్తి చూపుతుండటంతో సీట్ల సంఖ్య పెంచాలనే డిమాండ్ ఏర్పడింది.

కొత్తవారికి అడ్మిషన్లు ఇవ్వలేకపోతున్నాం

కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు గడచిన వేసవిలోనే భర్తీ అయ్యాయి. సీట్లు నిండిపోవడంతో కొత్తగా అడ్మిషన్ల కోసం వచ్చేవారికి ఎలాంటి సహకారం అందించలేకపోతున్నాం. సీట్ల సంఖ్య పెంచడం అందుకు అనుగుణంగా సౌకర్యాలను మెరుగుపరిస్తేనే కొత్త అడ్మిషన్లు ఇవ్వడానికి అవకాశం ఉంది.

– స్వప్న, ప్రత్యేకాధికారిణి, మోర్తాడ్

కొత్త కోర్సులు.. భవిష్యత్తుకు సోపానాలు

- ప్రతిభ కనబరిస్తే ఉద్యోగం సులభమే
- అందుబాటులోకి ఏటీసీలు
- ఐటీఐలో ఆధునిక కోర్సులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు (ఫైల్)

నిజామాబాద్ అర్బన్: ఐటీఐలను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు లభించేలా తీర్చిదిద్దుతూ నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో భాగంగా పలు ఐటీఐలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్)లుగా మార్చింది. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచి మంచి వేతనంతో ఉద్యోగాలు కల్పించనున్నాయి.

ఐటీఐలలో 1,516 సీట్లు

ఐటీఐ పూర్తిచేసిన వారికి త్వరగా ఉపాధి లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పదో తరగతి పూర్తి చేసిన వారు ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు ఉండగా, అందులో 1,516 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఏడాది కోర్సులుగా కంప్యూటర్ వెల్డర్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అనలిస్ట్, రెండేళ్ల కోర్సులుగా డ్రాఫ్ట్‌మెన్(సివిల్), డ్రాఫ్ట్‌మెన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, మిషనిస్ట్ టర్నర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు.

21లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఐటీఐ, ఏటీసీలలో ప్రవేశాలకు ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 21లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఐటీఐలో చేరే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కోర్సు ప్రతిపాదికన వెబ్ ఆప్షన్లు పెట్టి ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. మెరిట్, రోల్ ఆఫ్ రిజర్వేషన్, వెబ్ ఆప్షన్ల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

ఏటీసీల్లో ఆరు కోర్సులు

జిల్లాలోని నిజామాబాద్, కమ్మర్‌పల్లి, బోధన్ ఐటీఐలను ప్రభుత్వం ఏటీసీలుగా తీర్చిదిద్దింది. ఒక్కో ఏటీసీలో 172 సీట్ల చొప్పున మొత్తం 516 సీట్లను అందుబాటులోకి తెచ్చింది. ఏటీసీల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు వెంటనే అప్రెంటిస్‌షిప్ కల్పిస్తారు. అదేవిధంగా ఇతర కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభించే అవకాశం మెండుగా ఉన్నాయి. ఏటీసీల్లో ప్రధానంగా ఆరు కోర్సులను ప్రవేశపెట్టారు. ఏడాది కోర్సులుగా ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, రెండేళ్ల కోర్సులుగా బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ అందుబాటులో ఉన్నాయి.

మంచి అవకాశం..



పదో తరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశం. అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఉపాధి త్వరగా లభిస్తుంది. ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి. ఐటీఐలో విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోవచ్చు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.

– యాదగిరి, జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపల్

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము వినోద్ రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఘనంగా సన్మానించారు. కొమ్ము వినోద్ రెడ్డి ఇటీవల వండర్ బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నాడు. దీంతో మధుయాష్కీ గౌడ్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

లబ్ధిదారులకు మెరుగైన సేవలందించాలి



కామారెడ్డి టౌన్: ఆస్పత్రులకు వచ్చే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందేలా చేయాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ ఆరోగ్యశ్రీ మిత్ర, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆస్పత్రిలో మంగళవారం ఆరోగ్యశ్రీ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు నిరంతరం సేవలు అందించేలా చూడాలన్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా టీం లీడర్లు అల్లావుద్దీన్, యశ్వంత్, ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



సుభాష్‌నగర్: హన్మకొండలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన ఇంటర్ సర్కిల్ విద్యుత్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తృతీయ స్థానం సాధించిన జిల్లా జట్టు క్రీడాకారులను ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్ మంగళవారం నగరంలోని పవర్ హౌస్ మీటింగ్ హాల్‌లో అభినందించారు. భవిష్యత్‌లో మొదటిస్థానంలో నిలవాలని, అందుకు అవసరమైన సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ తోట రాజశేఖర్, ఏఏవో గంగారాం, జేఏవో పూదరి గంగాధర్, సెక్రటరీ ఏ గోపి, కోశాధికారి వీ ఉత్తమ్‌సింగ్, దినేశ్, కేఎస్ఆర్ మూర్తి, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డుల ప్రదానం



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన పలువురు మంగళవారం దళితరత్న అవార్డులను అందుకున్నారు. హైదరాబాద్‌లోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మాలలకు జరిగిన అన్యాయాలు, మాల జాతి అభివృద్ధిపై రాష్ట్ర నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చెరుకు రామచందర్, సక్కి గంగాధర్, మందాల భాస్కర్, బీర రాజేశ్వర్, రావుల అంజన్న పాల్గొన్నారు. సమావేశం అనంతరం నిజామాబాద్ జిల్లాకు చెందిన గోపు మోహన్, ధోడ చంద్రకాంత్, మర్రి కిరణ్ కుమార్, పెద్దోళ్ల పోశెట్టిలు చేసిన సేవలను గుర్తించి దళిత రత్న అవార్డులను ప్రదానం చేశారు.

రైతన్న.. జర భద్రం

- ప్రకృతి వైపరీత్యాలు, విష కీటకాలతో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఆదమరువొద్దు.. అప్రమత్తతే శ్రీరామరక్ష



బోధన్‌రూరల్/ఆర్మూర్: ఖరీఫ్ సీజన్ పంటల సాగు ఊపందుకుంది. రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. నిత్యం వ్యవసాయ క్షేత్రాల్లో ఉండే రైతులకు పొంచి ఉన్న ప్రమాదాలను అధిగమించడం కత్తి మీద సాము లాంటింది. ప్రకృతి వైపరీత్యాలు, పాములు, క్రిమికీటకాలు, విద్యుత్ మరమ్మతు పనులు, మందుల పిచికారీ సమయాల్లో ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతుంటారు. కొన్నిసార్లు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు తరచూ చూస్తూనే ఉంటాం. అలాంటి ప్రమాదాల బారిన పడకుండా వ్యవసాయ క్షేత్రాల్లో అన్నదాతలు, వ్యవసాయ కూలీలు పాటించాల్సిన పలు జాగ్రత్తలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పిడుగుపాటు

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కిందకు వెళ్లొద్దు.
- విద్యుత్ ప్రసరించే వస్తువులు, కరెంట్ తీగలకు దూరంగా ఉండాలి.

పాములు, విషపురుగులు..

- పొలాల గట్లపై గడ్డి పెరగకుండా చూసుకోవాలి.
- కలుపు మొక్కలను తొలగించే, గట్లపై నడిచే సమయాల్లో జాగ్రత్తగా ఉండాలి.
- బోర్లు, మోటారు స్టార్టర్ల వద్ద గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఏదైనా కీటకం కాటు వేసినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యులను సంప్రదించి సరైన వైద్యం చేయించుకోవాలి
- పాము, విష పురుగులు, కీటకాలు కరిచినప్పుడు నాటువైద్యం చేయించుకోకూడదు.

పాము కాటు నివారణ..

పాము కాటు వేయగానే అది విషపూరితమైన పామా లేక, మామూలు పామా అన్నది ముందుగా గుర్తించాలి. ఒకటి, రెండు కోరలతో కాటు వేసిన గాయం ఉంటే అది విషపూరితమైన పాముగా నిర్ధారించుకోవాలి. మూడు లేదా అంతకంటే ఎక్కువ కోరలతో గాయం ఉంటే అది విష రక్త పాముగా గుర్తించాలి. విషపూరితమైన పాము కాటు వేసినపుడు ప్రథమ చికిత్సలో భాగంగా కాటు వేసిన శరీర భాగం నుంచి గుండెకు రక్తం వెళ్లే వైపు తాడుతో గట్టిగా కట్టివేయాలి. కాటు వేసిన భాగంలో బ్లేడు లేదా సిరంజిలాంటి పదునైన ఆయుధంతో గాటు పెట్టి రక్తాన్ని పిండివేయాలి. నల్లని రక్తం వస్తుంది. అంటే విషపూరితమైన రక్తం అన్నమాట. ఇలా చేసిన తరువాత మనిషి స్పృహలోకి వస్తాడు. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాలి.

మందుల పిచికారీ సమయాల్లో..

- పురుగుల మందులను పిచికారీ చేసే సమయంలో రైతులు, కూలీలు చేతులకు గ్లౌజులు, కాళ్లకు రబ్బరు బూట్లు, ముక్కుకు గుడ్డలను ధరించాలి.
- పిచికారీ మందులను కర్ర సహాయంతో కలుపుకోవాలి.
- మందుల పిచికారీ, ఎరువులు చల్లడం వంటి పనులు పూర్తయిన వెంటనే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- ఇంటికి వెళ్లగానే స్నానం చేసి తర్వాతే భోజనం చేయాలి.
- పురుగు మందుల డబ్బాలు, ఎరువుల బస్తాలను వాడిన వెంటనే సర్ఫ్ నీటితో శుభ్రం చేసుకోవాలి.

మూఢనమ్మకాలను వీడాలి..



పాముకాటుకు గురైనపుడు మూఢనమ్మకాలపై ఆధారపడి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు మందులు అందుబాటులో ఉన్నాయి. పాముకాటుకు గురైనవారు పీహెచ్‌సీలో చికిత్స చేయించుకోవడానికి రావాలి. ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

విద్యుత్ విపత్తులు

పొలాల్లో ఉండే మోటారు స్టార్టర్లలో వర్షపు నీరు చేరి సమస్యలు వస్తుంటాయి. వాటిని సరిచేసేందుకు రైతులు అజాగ్రత్తగా మోటార్లు, స్టార్టర్లను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది.

- మోటార్ బోర్డులు, స్టార్టర్లు వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ డబ్బాలను అమర్చుకోవాలి.
- మోటార్లను ఆన్, ఆఫ్ చేసే సమయాల్లో చేతులు తడిగా లేకుండా చూసుకోవాలి.



- చేతులకు గ్లౌజులు వాడటంతో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చు.
- నాణ్యమైన పరికరాలు, కాళ్లకు పాదరక్షలు ఉంచుకుంటే మంచిది.

త్రినేత్ర శివలింగం.. ఉమామహేశ్వర ఆలయం

మీకు తెలుసా?



గోదావరి తీరంలోని ఉమామహేశ్వర ఆలయం

నందిపేట మండలం ఉమ్మెడ శివారులో గల గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ఉమామహేశ్వర ఆలయం ఎంతో విశిష్టత కలిగి ఉంది.

- త్రేతాయుగంలో శ్రీరాముడు నడిచిన బాటలో గోదావరి నది ఒడ్డున ఇసుతో సైకత లింగాన్ని చేసి శివరూపాన్ని భక్తితో పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి.
- ఈ శివలింగం ప్రత్యేకతను తెలుసుకొని సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం 10, 11 వ శతాబ్దపు మధ్యకాలంలో కల్యాణ చాళుక్యుల మహారాజైన మహా మండలేశ్వరుడు కట్టించిన దేవాలయమని అని చరిత్ర ద్వారా తెలుస్తుంది.
- ఈ ఆలయంలో శివలింగం మీద త్రినేత్రం కనిపించడం విశేషం.
- దీపగండంగా పిలువబడే 108 దీపాల ధ్వజ స్తంభం ప్రత్యేకత.
- షోడశ స్తంభాలతో మండపం. ప్రతి స్తంభం మీద నాగ శాసనాలు, దేవాలయం చుట్టూ దాన శాసనాలు(ప్రతేక లిపితో రాసినవి) కలిగి ఉంటాయి.
- ప్రతి సంవత్సరం వర్షాకాలంలో గోదావరి బ్యాక్ వాటర్‌లో నీటమునిగే దేవాలయం, శివరాత్రి సమయంలో బయట పడుతుంది. మూడురోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు.
- నందిపేట మండల కేంద్రానికి 8 కిలో మీటర్ల దూరంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో నది ఒడ్డున ఉండడంతో ఈ ఆలయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

– నందిపేట్

నా కొడుకు ఆచూకీ కనిపెట్టండి

- ప్రవాసీ ప్రజావాణిలో తండ్రి వినతి



ప్రవాసీ ప్రజావాణి చైర్మన్ జీ చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గంగారాం, చిన్నారెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): అబుదాబీ దేశంలో అదృశ్యమైన తన కొడుకు బట్టు నాగార్జున ఆచూకీ కనిపెట్టాలని ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బట్టు గంగారాం కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణి చైర్మన్ జీ చిన్నారెడ్డి, తెలంగాణ గల్ఫ్ ఎన్నారై చైర్మన్ భీమ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం అబుదాబీ వెళ్లిన నాగార్జున అదృశ్యమైనట్లు తెలిపారు. దీంతో స్పందించిన చిన్నారెడ్డి అబుదాబీలోని ఎంబసీ అధికారులతో మాట్లాడారు. వారం రోజుల్లోగా నాగార్జున ఆచూకీ కనిపెట్టడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి శ్రీకాంత్, అగల్‌దివిటి శ్రీనివాస్, కే వినోద్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ ఖోఖో పోటీలో ప్రతిభచాటిన విద్యార్థి



బహుమతి అందుకుంటున్న శేర్ల గగన్ దీప్

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన శేరల గగన్‌దీప్ నేపాల్ దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ యూత్ గేమ్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. నేపాల్ యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండో – నేపాల్ ఖోఖో టోర్నీలో భారత్ తరపున ఆడిన గగన్‌దీప్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జట్టు మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేశాడు. ఈ మేరకు పలువురు గగన్‌దీప్‌ను అభినందించారు.

గిరిజనుల సాధికారత కోసమే పీఎం జన్‌మన్



బీబీపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

డిచ్‌పల్లి: గిరిజనుల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి 30 వరకు జన జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న పీఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగోరావు సూచించారు. డిచ్‌పల్లి మండలం బీబీపూర్, బీబీపూర్ తండా గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పీఎం జన్‌మన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని గిరిజనులకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలు, 63 వేల గ్రామాలు, 5.5కోట్ల గిరిజన జనాభా అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ఎంపీడీవో బుక్య లింగం నాయక్, గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ గోపీకృష్ణ, ఎఫ్‌బీవో రాకేశ్, ట్రైబల్ వాలంటీర్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఉపాధ్యాయుడు రాజు, అంగన్‌వాడీ టీచర్ సక్కుబాయి, ఆశ వర్కర్ ప్రియాంక, వీవో దివ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



బోధన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

బోధన్: భూ సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ రైతులకు సూచించారు. బోధన్ పట్టణంలోని గ్రామ చావిడి వద్ద మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించి, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ విఠల్, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్ పట్వారీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినొద్దీన్, కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఏటా ఇదే కోత!



బస్సాపూర్ శివారులో వరద కాలువ కట్ట కోతకు గురవుతూ వస్తున్న నీరు

- వరద కాలువలోకి మిగులు జలాలు
- కోతకు గురవుతున్న కాలువ కట్ట



కిసాన్‌నగర్ శివారులో ఏర్పడిన గండి

బాల్కొండ: ఎస్సారెస్పీ మిగులు జలాలను సద్వినియోగపరిచేందుకు నిర్మించిన వరద కాలువ ఎగువ ప్రాంతాల నుంచి వస్తోన్న నీటితో ప్రతి సంవత్సరం కోతకు గురవుతోంది. బాల్కొండ మండలం కేంద్ర శివారులోని అలీం చెరువు నీరు అలుగు పారినప్పుడు మిగులు జలాలు బస్సాపూర్ మీదుగా మాటు కాలువలో ప్రవహించి వరద కాలువలో కలుస్తాయి. ప్రస్తుతం బస్సాపూర్ లిప్ట నీరు కూడా వచ్చి వరద కాలువలోనే కలుస్తుండడంతో కట్ట కోతకు గురవుతోంది. కట్ట మొరం భారీగా కొట్టుకు వచ్చి నీటి ప్రవాహానికి అంతరాయంగా మారుతోంది. బస్సాపూర్ గ్రామస్తులు సొంతగా పైప్‌లైన్ వేయించి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు కాలువలోకి చేరేలా చేశారు. కానీ, కాలువ ఎగువన ఉన్న నీరు దిగువకు వెళ్లేందుకు సైఫన్ లేదా సూపర్‌పాస్ నిర్మిస్తే ఆయకట్టుకు దోహదపడుతుంది. అధికారులు అటు వైపు కృషి చేయడం లేదు. ఫలితంగా చెరువు, లిప్ట నీరు కాలువ పాలవుతున్నాయి. మైనర్ ఇరిగేషన్ అధికారులే ఆ పనులు చేపట్టాలని ఎస్సారెస్పీ అధికారులు చెప్తున్నారు. కాగా, వరద కాలువను పర్యవేక్షించే ఎస్సారెస్పీ అధికారులే పనులు చేపట్టాలని మైనర్ ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో మధ్యలో బస్సాపూర్ గ్రామస్తులు నలుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కిసాన్‌నగర్, వేంపల్లి, వన్నెల్(బి)లలో..



ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో వానలకు ఏర్పడిన గండి

కిసాన్‌నగర్, వేంపల్లి, వన్నెల్(బి) గ్రామాల శివారులోని వరద కాలువ వెంట ఇదే పరిస్థితి నెలకొంది. మూడు చోట్ల ఇది వరకే భారీ గండ్లు ఏర్పడ్డాయి. వన్నెల్(బి) వద్ద మరమ్మతులు చేపట్టారు. కిసాన్‌నగర్, వేంపల్లి శివారులో ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. వన్నెల్(బి) వద్ద బోదేపల్లి చెరువు నీరు అలుగు నుంచి భారీ ప్రవాహం వస్తుంది. కిసాన్‌నగర్, బాల్కొండ మండల కేంద్ర శివారులో నాగుల కుంట నుంచి నీరు ప్రవహిస్తుంది. వీటన్నింటికీ సూపర్ పాస్‌లు నిర్మిస్తే కాలువ కట్ట కోతకు గురికాదు. అంతే కాకుండా నీటి వినియోగం జరుగుతుంది.

మైనర్ ఇరిగేషన్ శాఖను సంప్రదించాలి

వరద కాలువలోకి వచ్చి చేరుతున్న నీటి వినియోగం కోసం మైనర్ ఇరిగేషన్ అధికారులను సంప్రదించాలని సూచించాం. చెరువుల నీరు వినియోగం ఆ శాఖ పరిధిలోకి వస్తుంది.

– గణేశ్, డిప్యూటీ ఈఈ, వరద కాలువ

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 16 తులాల బంగారం, నగదు అపహరణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని గ్యాదరి అరవింద్ ఇంట్లో ఈ నెల 16న తెల్లవారు జామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరోగ్యం బాగోలేక పోవడంతో అరవింద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని సామగ్రి చిందర వందరగా పడి ఉన్నాయి. దుండగులు 16 తులాల బంగారం, రూ. 30 వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COMPUTER EDUCATION

■ గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వసతితో కంప్యూటర్ శిక్షణ + ఉద్యోగం Age: 18-30 yrs / SSC Pass, Last Date: 25-06-25, NZB. 9014569553. [SCA25005075]

WANTED

■ ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239. [SCA25004985]

■ Wanted Teachers for Higher Classes Fluency in English is Essential Interested Contact Immediately St. Xaviers High School, Opp: forest Office, Varni Road, Nizamabad. 8639189010. [Z-7143]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

లైంగిక కోరిక తీర్చాలన్నందుకే హత్య

- తండ్రిని చంపిన కూతురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్సై వినయ్

బోధన్: తండ్రిని రోకలి దుడ్డుతో కొట్టి చంపిన కూతురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నవీపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నవీపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య(54)కు ఇద్దరు కూతుళ్లు. ఇరువురికి వివాహం చేశారు. పెద్ద కూతురు గంగామణి భర్త మృతి చెందడంతో పదేళ్ల నుంచి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ధర్మారంలోనే ఉంటుంది. పెద్ద కూతురు గంగామణి పట్ల నర్సయ్య అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. దీంతో ఇంట్లో గొడవలు జరిగి పది రోజుల నుంచి నర్సయ్య భార్య నర్సమ్మ, పెద్ద కూతురు నిజామాబాద్‌లో వేరుగా జీవిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని తాళ్ల కొత్తపేట గ్రామంలో ఉంటున్న చిన్న కూతురు మక్కల వర్షిణి అలియాస్ మమత సోమవారం ధర్మారంలోని తండ్రి వద్దకు వచ్చింది. మద్యం మత్తులో ఉన్న నర్సయ్య లైంగిక కోరిక తీర్చాలని చిన్న కూతురుని వేధించాడు. ఆగ్రహించి పక్కనే ఉన్న రోకలి దుడ్డుతో తలపై రెండుసార్లు కొట్టడంతో నర్సయ్య అక్కడికక్కడే మరణించాడు. రక్తం, గాయాలు చూసి భయపడిన మమత ఇంటి తలుపులు దగ్గరగా మూసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో నవీపేట ఎస్సై వినయ్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని చందాపూర్ గ్రామశివారులో విద్యుదాఘాతానికి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. గ్రామానికి చెందిన గడ్డం నారాయణరెడ్డి(69) సోమవారం తన గేదెలను మేపేందుకు గ్రామ శివారులో కౌలు చేస్తున్న రాజిరెడ్డి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పొలం వద్ద గేదెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రణదీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లింగసముద్రంలో మరొకరు..

డిచ్‌పల్లి: మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన గంగనర్సయ్య(59) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామ శివారులోని తన పొలానికి నర్సయ్య వెళ్లాడు. పొలంలో మోటారు పనిచేయకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను టెస్టర్‌తో చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన మసూరి పుష్ప(34) సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం పుష్ప ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు తట్టి లేపేందుకు యత్నించినా స్పందించలేదు. కుటుంబీకులకు సమాచారం అందించడంతో పక్కనే ఉంటున్న తల్లి చేరుకొని కిటికీల ద్వార లోపలికి చూడగా ఉరేసుకుని ఉన్నట్లు గుర్తించారు. పుష్పకు గతంలో నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించగా విడాకులు కావడంతో తల్లి గారింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఇటీవల గర్భం రావడంతో పెళ్లి చేసుకోవాలని కోరింది. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా అశోక్ అంగీకరించక పోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. తల్లి గంగామణి ఫిర్యాదు మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పులాంగ్ వాగులో పడి వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులాంగ్ వాగులో పడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వినాయక్‌నగర్‌కు చెందిన రాజమౌళి(76) కొంత కాలంగా నరాల బలహీనత ఇబ్బందులు పడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో మంగళవారం పులాంగ్ వాగులో పడి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామంలో మంగళవారం శతాధిక వృద్ధురాలు మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పట్టెం వెంకవ్వ (102) అనారోగ్యంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆమె అంత్యక్రియలకు దాక్షాయని స్వచ్ఛంద సంస్థ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కారు, బైకు ఢీకొని ఒకరు..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ శివారులో మంగళవారం కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి హసన్‌పల్లికి బైకుపై వెళ్తున్న అంజయ్యను బాన్సువాడ వైపు నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయమైనట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంజయ్యను ఆటోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా అంజయ్య మృతి చెందినట్లు తెలిపారు.